హోం భీమ్ బుష్


దారుణంగా మారిన వేమగిరి రోడ్డు

గురువును మించిన శిష్యురాలామె... ఎంతటివారినైనా తన మాటల గారడీతో ఆకట్టుకుంటారు. అధికారంలో ఒకలా ప్రతిపక్షంలో మరోలా ప్రవర్తిస్తున్న హోం మంత్రి అనిత వ్యవహార శైలిని చూసి ముక్కున వేలేసుకోవాల్సిందే.. రోడ్డు బాగు చేయలేని దుస్థితిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉందని నాడు నిరసన పాదయాత్ర చేసి నేడు అధికారంలోకి రాగానే మీనమేషాలు లెక్కిస్తున్నారు. పర్యవసానంగా అడ్డురోడ్డు-నర్సీపట్నం రోడ్డుతోపాటు పలు రోడ్లపై ప్రయాణమంటే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు.

- అడ్డురోడ్డు-నర్సీపట్నం రోడ్డుపై హోం మంత్రి అనిత నిర్లిప్తత
- రోడ్డు బాగు చేయాలని నాడు ప్రతిపక్షంలో పాదయాత్ర
- అధికారంలో రాగానే శంకుస్థాపనతో సరి
- అర్థాంతరంగా వదిలేసిన కాంట్రాక్టరు
- గతుకుల రహదారిపై వాహన చోదకుల ఇక్కట్లు

ఎస్.రాయవరం: హోం మంత్రి ఇలాకాలో అడ్డురోడ్డు-నర్సీపట్నం రోడ్డు గతుకులమయంగా మారింది. ప్రమాదాలకు నిలయంగా మారిన ఈ రోడ్డులో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సుమారు 16 కిలోమీటర్ల మేర ఉన్న రోడ్డు ఇప్పటికే మూడు పర్యాయాలు పనులు మొదలు పెట్టి వదిలేశారు. ఇప్పుడు గతుకులు సమస్య ఎక్కువ కావడమే కాకుండా చేసిన ఎర్త్ వర్కు వల్ల దుమ్ము,ధూళి రేగడంతో కళ్లలో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. దాంతో ద్విచక్ర వాహనంపై వెళ్లాలంటే బెంబేలెత్తిపోతున్నారు.

ఈ రోడ్డు ప్రధానంగా నర్సీపట్నం, కోటవురట్ల మండలాలతోపాటు, లక్కబొమ్మలకు ప్రసిద్ధి గాంచిన ఏటికొప్పాక, మేజర్ పంచాయతీ దార్లపూడి, చినగుమ్ములూరు, రామయ్యపట్నం, చెల్లాపురం, పెట్టుగొళ్లపల్లి, పెదగుమ్ములూరు గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డు సమస్య అధికారుల దృష్టికి వెళ్లడంతో అప్పటి రాష్ట్ర తెలుగు మహిళా అధ్యక్షురాలు, ప్రస్తుత హోంమంత్రి వంగలపూడి అనిత నిధులు కేటాయించి రోడ్డు వేయలేదని పది కిలోమీటర్ల మేర నిరసన పాదయాత్ర చేశారు. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం వచ్చాక ఆమె హోంమంత్రిగా పగ్గాలు చేపట్టి నియోజకవర్గానికి వచ్చి రోడ్డు వేస్తున్నట్టు చెప్పడమే గాని పనులు పూర్తి చేసిన దాఖలాలు లేవు.


దార్లపూడి సమీపంలో రోడ్డుపై ప్రమాదకరంగా గుంత

అట్టహాసంగా హోంమంత్రి శంకుస్థాపన

రూ. 24 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు కోసం గతేడాది నవంబర్‌లో జిల్లా కలెక్టర్ సమక్షంలో హోం మంత్రి అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం చెప్పినట్టు సంక్రాంతికి గతుకులు రోడ్డు సమస్య పరిష్కారం అవుతుందని ఆశాభావంలో ఉన్న వాహనదారులకు నిరాశే మిగిలింది. నిత్యం కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చి పనులు పూర్తి చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జనవరి చివరిలో మరో మారు కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి హడావడి చేశారు. రోడ్డు గతుకులతోపాటు పనులు చేసినప్పుడల్లా రాకపోకలకు ఇబ్బందులు కలుగుతూనే ఉన్నాయి. దార్లపూడి శివారు రెండు పనులు చేసి కాంట్రాక్టర్ పత్తా లేకుండా పోయాడు. అసలు ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయింపు జరిగిందా... లేదా అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఏటికొప్పాక బొమ్మలు కొనుగోలు చేసే పట్టణ వాసులు ఈ రోడ్డుపై రావాలి. అన్ని విధాలా ప్రాధాన్యత కలిగిన రోడ్డు పనులు ఆలస్యం ఎందుకు చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదేవిధంగా పెదఉప్పలం, వేమగిరి రోడ్లు రెండు కిలోమీటర్ల మేర గతుకులమయంగా ఉన్నాయి. ఇకనైనా దృష్టి సారించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.


దార్లపూడి శివారులో రోడ్డు పనులు ప్రారంభించి వదిలేసిన దృశ్యం

తమ్ముళ్లూ రోడ్డు ఎలా వదిలేశారు...

కూటమి ప్రభుత్వం వచ్చిన కొత్తలో సీఎం చంద్రబాబు దార్లపూడి శివారులో రోడ్డు షో నిర్వహించి ఇక్కడ సమావేశంలో పాల్గొన్నారు. చూడండి తమ్ముళ్లూ.. రోడ్లన్నీ గతుకులు.. ముందుగా ఇవన్నీ పూడ్చుకోవాలి. లేదంటే నడ్డి విరుగుతుందని గత పాలనపై వ్యంగ్యంగా వ్యాఖ్యానించి రోడ్డు గతుకులు పూడ్చండని చెప్పి వెళ్లిపోయారు. ఇప్పటికి ఏడు నెలలు దాటినా వారు పట్టించుకున్న పాపాన పోలేదు.


నీలాద్రిపురం సమీపంలో రెండు నెలల క్రితం చదును చేసి వదిలేసిన రోడ్డు

రెండు మూడు నెలల్లో పనులు పూర్తి



సమస్యాత్మకంగా ఉన్న రోడ్డు పనులు వేగవంతంగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కి చెబుతున్నాం. రెండు మూడు రోడ్లకు ఒక్కరే కాంట్రాక్టర్ కావడం వల్ల ఒకదాని తర్వాత మరొక్కటి పనులు చేస్తూ వస్తున్నారు. రోడ్డు పనులు ప్రారంభించేందుకు ఈ నెల చివరికి తెలుస్తాది. రెండు మూడు నెలల్లో పనులు పూర్తి చేస్తాం. నిధులు వెనక్కి వెళ్లకుండా ఉండేందుకు పనులు ప్రారంభిపచేశాం.

– జ్ఞానేశ్వరరావు, ఏఈ, ఆర్‌అండ్‌బీ, నక్కపల్లి

హోంమంత్రి శంకుస్థాపనతో సరి



కూటమి పాలకులు సంక్రాంతికి గతులు రోడ్డులు పూర్తి చేస్తామని గొప్పలు చెప్పారు. దార్లపూడి అడ్డురోడ్డు రోడ్డు గతుకులతో ప్రమాదకరంగా మారింది. సాక్షాత్తు హోంమంత్రి శంకుస్థాపన చేసి 140 రోజులు గడుస్తున్నా పట్టించుకోలేదు. ప్రధాన సమస్యగా ఉన్న రోడ్డు పనులు ముందు చేపట్టాలి.

– పోలిశెట్టి పెద ఈశ్వరరావు, వైఎస్సార్‌సిపి నాయకుడు దార్లపూడి, ఎస్.రాయవరం మండలం

క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయం


సైకిల్ స్టాండ్‌కు భూమిపూజ చేస్తున్న పూర్వ విద్యార్థులు

మునగపాక: విద్యాభివృద్ధికి పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహకారం అభినందనీయమని హెచ్ఎం శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1993–94లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఇక్కడ సైకిల్ స్టాండ్ ఏర్పాటుకు గురువారం భూమిపూజ చేశారు. హెచ్ఎం మాట్లాడుతూ హైస్కూల్‌కు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. విద్యార్థులు ఇష్టపడి, కష్టపడి చదువుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరావు, పూర్వ విద్యార్థులు ఆడారి గంగమహేష్, పొలిమేర దేవతనాయుడు, బలరాం తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం


కె.వెంకటాపురంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీటీసీ రత్నం

కోటవురట్ల: కె.వెంకటాపురంలో సీసీ రోడ్ల పనులను ఎంపీటీసీ సభ్యురాలు కాళ్ల రత్నం గురువారం ప్రారంభించారు. రూ.8 లక్షల పంచాయతీ నిధులతో ఈ పనులు చేపట్టినట్టు సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ తెలిపారు. రైతు సేవా కేంద్రం, సచివాలయం, పంచాయతీ కార్యాలయాలకు సంబంధించి మూడు రోడ్ల మేర పనులు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పైల నాని, పోతల రమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

'మీ గణితం' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న హోంమంత్రి అనిత

పాయకరావుపేట: మండలంలో గుంటపల్లి హైస్కూల్ ఉపాధ్యాయుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత షేక్ నాగూర్‌ను హోం మంత్రి వంగలపూడి అనిత తన స్వగృహంలో సన్మానించారు. ఆయన రచించిన మీ గణితం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగులకు సరఫరా చేయడానికి వెయ్యి కాపీలను ముద్రించడానికి గూటూరు శ్రీనివాసరావు ఆసక్తి చూపినట్లు తెలిపారు.

రేపటి నుంచి కాశీ విశ్వేశ్వరస్వామి ప్రాణ ప్రతిష్ట


ప్రాణ ప్రతిష్ట పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: అచ్యుతాపురం మండలం చీమలాపల్లిలో ఈ నెల 17న జరగనున్న స్వయంభూ కాశీ విశ్వేశ్వర స్వామి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆయన మునగపాకలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చీమలాపల్లి గ్రామంలో ఈనెల 15 నుంచి 17 వరకు అన్నపూర్ణ సమేత స్వయంభూ కాశీ విశ్వేశ్వర స్వామి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాలు వైభవంగా జరుగుతాయన్నారు. ఇందులో భాగంగా 17న ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు నాగేశ్వరరావు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

క్రిమిసంహారక మందు తాగి వ్యక్తి మృతి

అనకాపల్లి: క్రిమిసంహారక మందు తాగి బి. వెంకట సత్యారావు(59) స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. దీనిపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఎస్సై వివరాల మేరకు... స్థానిక లోకా వారి వీధికి చెందిన వెంకట సత్యారావు మెయిన్‌రోడ్డులో శ్రీధరాల పైడిశెట్టి స్వగృహం వద్ద పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఇంటి తాలూకా డాక్యుమెంట్స్ తీసుకుని రావాలని ఓనర్ పైడిశెట్టి కొన్ని రోజులుగా వేధిస్తుండటంతో మనస్తాపం చెంది ఈ నెల 11న క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. హుటాహుటిన ఎన్టీఆర్ ఆస్పత్రిలో చేర్పించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు


బాల్య వివాహాలపై అనర్థాలను వివరిస్తున్న కౌన్సెలర్ రమ్య

మునగపాక: బాల్య వివాహాల వల్ల అనర్థాలు చోటు చేసుకుంటాయని కౌన్సెలర్ కేఎల్‌వీ రమ్య తెలిపారు. గురువారం స్థానిక ప్రియదర్శిని ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా బాలల సంరక్షణలో భాగంగా జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలు చేసుకోవడం ద్వారా విలువైన జీవితాలు నాశనం అవుతాయన్నారు. దుష్ఫలితాలు ఎదురవుతాయన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాలికలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కష్టపడి చదువుకొని మంచి ఫలితాలు సాధించాలన్నారు. బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

26న దక్షిణేశ్వరుని ఆలయంలో కల్యాణం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లి–మల్లవరం గ్రామాల పరిధి దక్షిణేశ్వరుని ఆలయంలో ఈ నెల 26న నిర్వహించే కల్యాణం విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించారు. మహా శివరాత్రి సందర్భంగా ఆలయ సన్నిధిలో కాశీ విశ్వేశ్వర స్వామి –ద్రాక్షాయిణిల కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు నిర్ణయించారన్నారు. కార్యక్రమంలో దొడ్డి శ్రీనివాసరావు, నూకప్పారావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం నేడు

అచ్యుతాపురం రూరల్: సురక్ష హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ అడిగర్ల సుధీర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం శ్రీ విష్ణు ఆస్పత్రి ఆరో వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేస్తున్న ఈ శిబిరంలో శ్రీ విష్ణు, కేర్, హెచ్.సి.జి. ఆస్పత్రుల వైద్యులు జనరల్ చెకప్, కీళ్ల నొప్పులు, చర్మ సమస్యలు, బి.పి, సుగర్, ఇ.సి.జి., హెమోగ్లోబిన్, అన్నిరకాల క్యాన్సర్, తదితర పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తారన్నారు.

మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి

మంగవరం హైస్కూల్‌ను పరిశీలించిన డీవైఈవో


విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న డీవైఈవో


పాఠ్యాంశాలు బోధనపై విద్యార్థులతో మాట్లాడుతున్న డీవైఈవో

పాయకరావుపేట: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ఉత్తీర్ణులు కావాలని యలమంచిలి డివిజన్ ఉప విద్యా శాఖాధికారి పి.అప్పారావు ఆకాంక్షించారు. మండలంలో మంగవరం హైస్కూల్‌ను ఆయన సందర్శించారు. ఇక్కడ పదో తరగతి విద్యార్థుల అభ్యాసన ఫలితాలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యార్థులతో కలిసి భుజించారు. అనంతరం పాఠ్యాంశాల బోధన గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి పాఠ్యాంశాలు, విద్యా బోధన, పరీక్షలు కోసం చేయవలసిన కృషిని వివరించారు. ఎంఈవో కె.రమేష్ బాబు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై విద్యార్థులకు పోటీలు


బహుమతులతో గెలుపొందిన విద్యార్థులు

యలమంచిలి రూరల్: మండలంలోని ములకలాపల్లి మైహోం సిమెంటు కర్మాగారం యాజమాన్యం ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు రహదారి భద్రతపై వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా కర్మాగారం శ్రీనగర్ కాలనీలో నిర్వహించిన ఈ పోటీల్లో పురుషోత్తపురం, పులపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థి దశ నుంచే రహదారి నియమాలు, భద్రతపై అవగాహన పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని మైహోం ఇండస్ట్రీస్ సీనియర్ జనరల్ మేనేజర్(ఆపరేషన్స్) బి. రామస్వామి అభిప్రాయపడ్డారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ డీజీఎం (పీఅండ్ ఏ) ఎల్ శ్రీనివాసరావు, డిప్యూటీ మేనేజర్(సేఫ్టీ) కె. సతీష్ రెడ్డి, సేఫ్టీ అధికారి డి. షణ్ముఖరావు, ఆయా స్కూళ్ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ


స్పోర్ట్స్ కిట్లతో విద్యార్థినులు, నాంది ఫౌండేషన్ ప్రతినిధులు

యలమంచిలి రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థినులకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. బాలికలంతా విద్యతో ఆటలకు ప్రాధాన్యమివ్వాలని ఫౌండేషన్ ప్రతినిధులు సూచించారు. స్పోర్ట్స్ కిట్లు పంపిణీకి ముందు సెయింట్ గోబిన్ సంస్థ ప్రతినిధులు 6 నుంచి 9వ తరగతి విద్యార్థినులకు శిక్షణ ఇచ్చారు. స్పోర్ట్స్ కిట్లలో రెండు టీ షర్టులు, బూట్లు, సాక్సు, శానిటరీ పాడ్లు, ఇతర ఆట వస్తువులు ఉన్నాయి. హెచ్ఎం వీవీ హిమబిందు, యాజమాన్య కమిటీ ప్రతినిధి ఆడారి ఆదిమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మునగపాక వీఆర్వోపై ఫిర్యాదు


డీటీ శేషుబాబుకు ఫిర్యాదు చేస్తున్న రైతు

మునగపాక: స్థానిక వీఆర్వో సురేష్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతు సత్యనారాయణ గురువారం డీటీ శేషుబాబుకు ఫిర్యాదు చేశారు. రీ–సర్వేలో లోపాలను సవరించేందుకు పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా, వీఆర్వో ఇంతవరకు ఎటువంటి న్యాయం చేయలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంలో మామూళ్లు అడుగుతున్నారని, అతనిపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు. తన భూమికి సంబంధించి అన్ని ఆధారాలున్నా కేవలం డబ్బుల కోసం పనులు ఆలస్యం చేస్తున్నారని వాపోయారు.

జీతాలు చెల్లించాలని నిరసన

అనకాపల్లి టౌన్: జీవీఎంసీ పరిధిలో చెత్త సేకరణకు పని చేస్తున్న క్లాప్ వాహన లోడర్లకు బకాయిపడ్డ జీతాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ అధ్యక్షుడు ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక వాహన యార్డు వద్ద జీతాలు చెల్లించాలని గురువారం నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ మూడు నెలలుగా లోడర్లకు కాంట్రాక్టర్ జీతాలు చెల్లించలేదని, వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. తక్షణమే జీతాలు చెల్లించకపోతే సోమవారం నుంచి చెత్త సేకరణ నిలిపివేస్తామని హెచ్చరించారు.

పదో తరగతిలో మెరుగైన ఫలితాలే లక్ష్యం

సోమలింగపాలెంలో రాత్రి విద్యార్థుల ఇళ్లకు వెళ్లిన డీవైఈవో అప్పారావు


సోమలింగపాలెంలో విద్యార్థుల నోటు పుస్తకాలను పరిశీలిస్తున్న డీవైఈవో అప్పారావు

యలమంచిలి రూరల్: పదో తరగతిలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా విద్యా శాఖ అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వ స్కూళ్లలో వంద రోజుల పునశ్చరణ తరగతులు జరుగుతుండగా, రాత్రి సమయాల్లో ఆయా పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు ఇళ్ల వద్ద ఏం చేస్తున్నరనే దానిపై ఆరా తీస్తున్నారు. వారిని వచ్చే నెలలో జరగబోయే పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధులను చేయడానికి కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం రాత్రి యలమంచిలి మున్సిపాలిటీ పరిధి సోమలింగపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు యలమంచిలి డిప్యూటీ డీఈవో అప్పారావు, ప్రధానోపాధ్యాయులు తనిఖీలకు వెళ్లారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పరీక్షలు బాగా రాసేందుకు వారి పాత్ర కీలకమని చెప్పి అవగాహన కల్పించారు. పరీక్షలు పూర్తయ్యే వరకు విద్యార్థులను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా ప్రణాళిక ప్రకారం చదవాలన్నారు. ఈ సారి ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఫలితాలు సాధిస్తారన్న నమ్మకం ఉందన్నారు. పోషకాహారంతో పాటు, 7 నుంచి 8 గంటలు నిద్రపోవాలని సూచించారు. పలువురు విద్యార్థులు చదువుతున్న సబ్జెక్టులకు సంబంధించి వారి పురోగతి, సామర్థ్యాన్ని ఆయన పరీక్షించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఏవీ హెచ్ శాస్త్రి, సోమలింగపాలెం ప్రధానోపాధ్యాయుడు బీవీఎస్ సాయిబాబా, పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షుడు పీఎస్ విశ్వేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అప్పారావు మృతికి సంతాపం


అప్పారావు (ఫైల్)

ఎస్.రాయవరం: వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావుకు తండ్రి అప్పారావు (85) మృతికి పలువురు పార్టీ నాయకులు సంతాపం తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న అప్పారావు గురువారం ఎస్.రాయవరంలో తన స్వగృహం వద్ద తుదిశ్వాస విడిచారు. స్థానిక శ్మశాన వాటికలో సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. సంతాపం తెలిపిన వారిలో జెడ్పీటీసీ కాకర దేవి, ఎంపీపీ కోన లోవలక్ష్మి, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, సర్పంచ్‌లు భూపతి అప్పారావు, కర్రి సత్యనారాయణ, దూళి శ్రీనుబాబు, శానాపతి శ్రీరాములు, కొప్పిశెట్టి సత్యం, కోశెట్టి వెంకటరమణ, గరగా నూకరాజు, పాలపర్తి పాపారావు, మల్లే లోవరాజు, దారబోయిన గణేశ్వరరావు, చోడిపల్లి శ్రీను, పార్టీ నాయకులు కొణతాల శ్రీనివాసరావు, మధువర్మ, లక్కోజు ఆదిమూర్తి, కాసెపు అప్పన్న, తదితరులు ఉన్నారు.

మర్యాదపూర్వక కలయిక



వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు, పాయకరావుపేట మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి, నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులు, ప్రజా సమస్యల గురించి అధినేతకు వివరించారు. -పాయకరావుపేట